క్లుప్తంగా

కొనసాగుతున్న కార్మిక దీక్షలు



తాడేపల్లి రూరల్: బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారం 283వ రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కార్మికులకు మద్దతు తెలియజేసి మాట్లాడారు. సుమారు 30 ఏళ్ల క్రితం సిమెంట్ ఫ్యాక్టరీని యాజమాన్యం అక్రమంగా లాకౌట్ చేసిందని దాంతో 300 దాదాపు కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు ఇవ్వలేదన్నారు. కార్మికులు దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్మికులు ఇస్మాయిల్, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, కాసమ్మ, మాణిక్యరావు, హగ్గయ్య, యెహోషువా, సారమ్మ, ఇమాంబి, రమాదేవి, దుర్గాభవాని, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు



దుగ్గిరాల: హెచ్ఐవీ, ఎయిడ్స్ పీడితులపై వివక్ష చూపకూడదని చైర్మన్ కె.నాగేంద్రం అన్నారు. శుక్రవారం దుగ్గిరాల మండలంలోని తుమ్మపూడి మార్తా నర్సింగ్ కళాశాలలో కరస్పాండెంట్ యనమల ఈశ్వర్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథి కాలేజీ చైర్మన్ కె.నాగేంద్రం తెనాలి హ్యాపీ స్వచ్ఛంద సంస్థ అవగాహన కల్పిస్తోందన్నారు. ఎవరికైనా సమస్యలు ఉన్నట్లయితే వారు 1097 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయొచ్చని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిగింది. సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

నాలుగు ద్విచక్రవాహనాలు ధ్వంసం


ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి బోల్తాపడిన సమయంలో అక్కడే ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్న ఘటన మండలంలోని వేమవరం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరుకు చెందిన ప్రసాదరావు తన కారులో శ్రీశైలం నుంచి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు వేమవరం అడ్డరోడ్డు సమీపంలో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఆ సమయంలో రోడ్డు పక్కన ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలపైకి వెళ్లింది. ఆ వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రసాదరావుకు స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఫిరంగిపురం: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తోందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ జహంగీర్, టి.భాస్కర్ అన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జె.ప్రసాదరావుకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసన వారంగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని, మెమో నంబర్ 57ను అమలుచేయాలని, ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశామని చెప్పారు. వారి వెంట అరుణారావు, వెంకటేశ్వరరావు, పేరయ్య, జుహీద్, పద్మజ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు రూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని శవం ఛిద్రమైన దశలో ఉందని సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించామన్నారు. మృతుడి సుమారు 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని ఆచూకీ తెలిసిన వారు నేరుగా గుంటూరు రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

అక్రమాలకు అదుపేది?

యథేచ్ఛగా కైలాసగిరిపై మట్టి అక్రమ తవ్వకాలు

మేడికొండూరు: పేరేచర్లలోని కైలాసగిరిపై మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొందరి అక్రమార్కుల తీరును అడ్డుకునేవారే కానరావడం లేదు. అత్యంత ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం కైలాసగిరి. సర్వే నంబర్ 581లో 64 ఎకరాల విస్తీర్ణంలోని జిల్లా పరిషత్ పరిధిలో కైలాసగిరి కొండ ఉంది. కొండ చుట్టుపక్కల కొన్ని ప్రాంతాల్లో నిర్మానుష్యంగా ఉండటంతో అక్రమార్కుల కళ్లు ఈ కొండపైన పడింది.

కొండ పటిష్టత ప్రశ్నార్థకం

కొండ చుట్టూ విలువైన గ్రావెల్ ఉండటంతో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని అక్రమంగా తవ్వుతూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. మరోపక్క కొండకు కన్నం వేసి మట్టి తవ్వకాలు చేస్తుండటంతో దాని పటిష్టత ప్రశ్నార్థకంగా మారింది. గుంటూరుకు కూత వేటు దూరంలో కైలాసగిరి ఉండటంతో ప్రజలు ఇక్కడకు నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు.

అధికారుల్లో స్పందన సున్నా

గతంలో పలుమార్లు ఇలాంటి అక్రమ తవ్వకాలను కైలాసగిరికి వచ్చే ప్రజలే అడ్డుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినా అధికారుల్లో స్పందన లేదు. వారం రోజుల క్రితం ఇదే తరహాలో కైలాసగిరి కొండపై విలువైన మట్టిని వందలాది ట్రిప్పుల్లో బయట ప్రాంతాలకు తరలించారు. అందులో భాగంగా గురువారం మరోసారి అక్రమ తవ్వకాలు కైలాసగిరి కొండపైనే జరుగుతుండటంతో స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వారి రంగ ప్రవేశంతో మట్టి అక్రమ తవ్వకందారులు దాన్ని నిలిపేశారు. అప్పటికే కొన్ని లారీలు లోడు నింపుకొని ఉన్నాయి. తవ్వకానికి ఉపయోగించిన క్రేను మరోపక్కగా వెళ్లిపోయింది.



కైలాసగిరి కొండ పక్కన జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలు

రాత్రి, పగలు తేడా లేకుండా

బయట గ్రావెల్‌కు పెద్ద డిమాండ్ ఉండటంతో అక్రమ తవ్వకందారులు రాత్రీపగలూ తేడా లేకుండా గ్రావెల్‌ను లారీల్లో బయటకు తరలిస్తున్నారు. ప్రజల్లో కైలాసగిరి పుణ్యక్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఇదే తరహాలో అక్రమ మట్టి తోలకాలు కొనసాగితే కొండ ప్రమాదంలో పడే అవకాశం ఉంది. దీంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా విజిలెన్స్, రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు స్పందించి, అక్రమ తవ్వకాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మట్టి లోడుతో వెళుతున్న లారీలు

స్వచ్ఛతలో అగ్రశ్రేణే లక్ష్యం

కమిషనర్ అలీమ్ బాషా

మంగళగిరి టౌన్: రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ 2025–2026లో అగ్రశ్రేణి ర్యాంకును సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీమ్‌బాషా అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛత హి సేవ 2025 ప్రణాళికపై ఎస్ఎస్ఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ అలీమ్‌బాషా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛత హి సేవపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. దీనిపై ప్రణాళికను మూడు దశలుగా రూపొందించామని తెలియజేశారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి సెప్టెంబర్ 25న తాడేపల్లి సీతానగరం ఘాట్‌లో మెగా ఈవెంట్‌ను జరపనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17–19, 23 తేదీల్లో కార్మికుల కోసం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడమే కాకుండా స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రణాళికలో అన్ని వర్గాల ప్రజలు భాగం కానున్నట్లు చెప్పారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కలుషిత నీరు.. ఆరోగ్యానికి చేటు

- మురుగునీటిలో పైప్‌లైన్
- ఆందోళనలో గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

తాడేపల్లి రూరల్: మురుగు కాలువలో తాగునీరు పైప్ ఉండటంతో నీరు కలుషితమై ఆరోగ్యానికి చేటు తెస్తుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్‌లో తాగునీటి అవసరాల నిమిత్తం గతంలో మున్సిపాలిటీగా ఉన్న సమయంలో తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. ఆ బోరు వైపు ఇప్పుడు గ్రామంలో మురుగునీరును మళ్లించారు. నిత్యం మురుగునీటిలోనే ఆ పైపులైను ఉంటోంది. అక్కడే ఆ మురుగునీరు ఉండటంతో ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న మురుగునీరు గతంలో ఇప్పటం నుంచి వడ్డేశ్వరం వచ్చే మార్గంలో ఎడమ వైపునకు పారేది. ప్రస్తుతం ఆ నీటిని కుడివైపు నుంచి బకింగ్‌హామ్ కెనాల్‌కు మళ్లించారు. వడ్డేశ్వరం–ఇప్పటం పొలిమేర డొంకలో తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన ఈ బోరు మీదుగా మురుగునీరు ప్రవహించి బకింగ్‌హామ్ కెనాల్‌లో కలవడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. మధ్యలో ఉన్న బోరు మీదుగా ఈ మురుగునీరు ప్రవహిస్తుండడంతో తాగునీరు కలుషితమవుతుందని తెలిసినా చర్యలు తీసుకోకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో వైరల్ ఫీవర్లతో పాటు ఇతర జ్వరాలు వస్తున్నాయి. కొన్నిచోట్ల మురుగునీరు కలుషితం కావడంతో డయేరియా వస్తోందని వెంటనే అధికారులు బోరును మార్చాలని స్థానికులు కోరుకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇప్పటంలో మురుగునీరు పారే కాలువలో మంచినీటి బోరు

పరిసరాల పరిశుభ్రత పాటించండి

ఫిరంగిపురం: పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఫ్రైడే–డ్రైడేలో భాగంగా పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. తక్కెళ్లపాడులో మలేరియా హెల్త్ అసిస్టెంట్ జె.బాబురావు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతను వివరించారు. బాబురావు మాట్లాడుతూ ఇంటి యజమానులు నీటి తొట్టెలను నాలుగురోజులకోసారి శుభ్రం చేసుకోవాలన్నారు. ఇంటి ఆవరణలో పనికిరాని టైర్లు, కొబ్బరిబొండాలు, గాజు సీసాలు, పాత వస్తువులు ఉంటే వాటిలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. సిమెంటు గాబులు, నీటి పీపాలు, కాలువలు పరిశీలించి దోమల లార్వా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఎబెట్ ద్రావణాన్ని చల్లించినట్లు తెలిపారు. జ్వరాలు ఉన్నవారిని గుర్తించి రక్తపూత పరీక్షలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జోస్ఫీనా, ఆశా కార్యకర్తలు ప్రమీలారాణి, పలీవాలు పాల్గొన్నారు.



డ్రమ్ములు శుభ్రం చేయిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పశువులకు గాలికుంటు టీకాలు

ఫిరంగిపురం: నుదురుపాడు పశువైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో ఈ నెల 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి పశువులకు వచ్చే ఒక వైరస్ అని దాని నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. నోటిలో గిట్టల మధ్యలో పుండ్లు, నోటి నుంచి ద్రవం కారడం, పాలు తగ్గిపోవడం, పాదాల్లో నొప్పి, అలసట, ఆకలి తగ్గడం, చూడి నిలవకపోవడం వ్యాధి లక్షణాలుగా గుర్తించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

మంగళగిరి పరిధిలో..

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ఇందిరానగర్, ఎల్‌బీ నగర్, గణపతి నగర్, ఆత్మకూరు రోడ్, ఎపీఎస్పీ బెటాలియన్, డీజీపీ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మంగళగిరి రూరల్ పరిధిలోని కృష్ణాయపాలెం, నవులూరు, యర్రబాలెం, పారిశ్రామిక వాడల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. చినకాకాని, కాజా, ఆత్మకూరు, పెదవడ్లపూడి, కొత్తపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తాడేపల్లి బైపాస్ ప్రాంతంలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం, రిలయన్స్ డిజిటల్ ప్రాంతం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయం, హోటల్ డి దేవ్, హైవే టవర్స్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

దుగ్గిరాల: దుగ్గిరాల సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గిరాల, చింతలపూడిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని దుగ్గిరాల ఏఈ కె.గోపి తెలిపారు.

సీతారాం ఏచూరికి నివాళి

దుగ్గిరాల: పీడిత ప్రజల ఉద్ధరణకు సీపీఎం కేంద్ర నేత సీతారాం ఏచూరి కృషి చేశారని సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు కొనియాడారు. శుక్రవారం దుగ్గిరాల మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం సమానత్వం సోషలిజంపై ఆర్ఎస్ఎస్ దాడిని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. బీజేపీ తీవ్ర దాడి చేస్తున్న తరుణంలో దాన్ని ఎదిరించి పోరాడే శక్తులను ఐక్యపరిచి ముందుకు తీసుకెళ్లడంలో సీతారాం కృషి అసమానమని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎస్.యోగేశ్వరరావు, ఎం.నాగమల్లేశ్వరరావు, అమ్మిరెడ్డి, వి.కృష్ణ మూర్తి, రాజశేఖర్, మాణిక్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో కామ్రేడ్ కొరిటాల, బాపనయ్య భవన్ తాడేపల్లి పట్టణ పరిధిలో సీపీఎం నాయకులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. కృష్ణయ్య, రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. కేశవరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి. శివనాగరాణి, ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జొన్న శివశంకరరావు, కంచుమాటి అజయ్‌కుమార్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు, ఫిరంగిపురం గ్రామాల్లో ఏచూరి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. నేతలు షేక్ మస్తాన్‌వలి, రాఘవయ్య, హరిబాబు, జీవీరావు, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో..

తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి వర్ధంతి జరిగింది. సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గాదె సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, తదితర నాయకులు పాల్గొన్నారు.

తాడేపల్లి కొత్తూరులో

తాడేపల్లి పట్టణ పరిధిలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాస కుమారి, ఎం. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.





వడ్డేశ్వరంలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

రాష్ట్ర స్థాయి పోటీలకు కొర్రప్రాడు జెడ్పీ హైస్కూల్ క్రీడాకారులు

మేడికొండూరు: మండలంలోని కొర్రప్రాడు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కడియం జయరావు తెలిపారు. పల్నాడు జిల్లా నందిగామలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యాన జరిగిన అండర్ 14, 17 బాలబాలికల సెపక్ తక్రా పోటీల్లో కొర్రప్రాడు జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ 14 విభాగంలో సన్నీ, వెంకట భార్గవి, వర్షిణి, వేణు అండర్ 17లో చిన్మయి, దివ్య, సురేంద్ర ఎంపికైనట్లు చెప్పారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కోట వెంకట శివ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో ప్రతిభ చూపితే క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, జయలక్ష్మి, అమల, శివనాగమని, రాధ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తెగని పంచాయితీ!

- బండారుపల్లి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వ్యవహారం
- ఎమ్మెల్యే కార్యాలయంలో చర్చలు
- పానయ్య కొనసాగింపునకే ఎమ్మెల్యే మొగ్గు

తాడికొండ: తాడికొండ మండలం బండారుపల్లి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వ్యవహారం తాడికొండ టీడీపీలో తెగని పంచాయితీగా మారింది. గ్రామానికి చెందిన గుంటుపల్లి పానయ్యను సొసైటీ చైర్మన్‌గా ప్రకటిస్తూ జీవో జారీ కావడాన్ని వ్యతిరేకిస్తూ గత నెల 18న గ్రామంలోని టీడీపీ సీనియర్ నాయకులంతా ఏకమై నిరసన తెలిపారు. ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటామంటూ గ్రామంలోని పార్టీ నాయకులంతా సొసైటీని చుట్టుముట్టారు. నచ్చజెప్పే యత్నం చేసిన ఎమ్మెల్యేకు తలనొప్పిగా మారడంతో మరోసారి చర్చిద్దామని ప్రమాణ స్వీకారం వాయిదా వేశారు. శుక్రవారం మానుకొండ శివరామకృష్ణ వర్గంతో ఎమ్మెల్యే కార్యాలయంలో చర్చలు జరిగాయి. వీటిలో గుంటుపల్లి పానయ్యను స్థానిక నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు.

సీనియర్లకు ప్రాధాన్యమివ్వరా

44 సంవత్సరాల నుంచి పార్టీలో ఉన్న మాకు ప్రాధానం ఇవ్వకుండా ఎన్నికల ముందు వచ్చిన వారికి ఇవ్వడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తైవా ఇంజిన్ తీసుకునేందుకు కూడా పానయ్య ఇంటికెళ్లి అడగాల్సిన పరిస్థితి రావడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. డబ్బులు తీసుకుని పదవి ఇచ్చారని ఆరోపణలు చేయడంపై ఎమ్మెల్యే ప్రశ్నించారని తెలిసింది. దీనికి మానుకొండ వర్గం స్పందిస్తూ డబ్బులిచ్చి పదవి తీసుకున్నామని పానయ్య చెబుతున్నాడని, పార్టీ ఫండ్ కింద రూ.10 లక్షలు, పదవి కోసం రూ.20 లక్షలు ఇచ్చామని అంటున్నాడని అదే మాట మీడియాలో చెప్పామని అంటే ఏం జరిగిందో ఆలోచించుకోవాలని ఎదురు ప్రశ్నించారు. అయినా పానయ్యకు ఉన్న రెండు నెలల గడువు ఉందని పదవి కొనసాగించాలని ఎమ్మెల్యే వెల్లడించడంతో మానుకొండ వర్గం నిరసన తెలిపింది. పార్టీలో పని చేసిన వారిని వదిలి కొత్తవారికి పట్టుబట్టి పదవి ఇవ్వడంలో అవినీతి జరగలేదా అంటూ పలువురు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.



ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట చేరిన బండారుపల్లి గ్రామ టీడీపీ నాయకులు

అనుమానాదస్పద స్థితిలో గుర్తు తెలియని మహిళ మృతి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జగనన్న కాలనీ రోడ్డులో మహిళ మృతదేహం కలకలం రేపింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుమారు 35 ఏళ్ల వయసున్న మహిళ నైటీలో కాలువ పక్కన మృతదేహంగా కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఆస్పత్రికి తరలించి అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌వీఆర్‌జేసీలో సదస్సు

గుంటూరు రూరల్: సాంకేతిక సమస్యలకు సులభతర పరిష్కార మార్గాలను శోధించాలని ప్రముఖ సాంకేతికరంగ నిపుణులు డాక్టర్ సతీష్ అనమలమూడి తెలిపారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సపోర్టింగ్ అసిమెట్రిక్ లింక్స్ ఇన్ లో–పవర్ నెట్‌వర్క్స్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇలాంటి తరహా సాంకేతికత ఉపయోగపడుతుందన్నారు.

రాజధాని రైతుల అర్జీల పరిష్కారానికి కృషి

జీఆర్ఎం నోడల్ అధికారి జయశ్రీ

తాడికొండ: రాజధాని రైతుల అర్జీలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని గ్రీవెన్స్ రీ డ్రెస్సల్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారి పి.జయశ్రీ అన్నారు. అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి శుక్రవారం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంత వాసులు, రైతు కూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్(జీఆర్ఎం) నోడల్ అధికారి జయశ్రీకి అందజేశారు. అర్జీదారులు అందజేసిన అర్జీలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు. వేతనాలను సకాలంలో చెల్లించాలంటూ పలువురు రాజధాని ప్రాంత పారిశుద్ధ్య కార్మికులు జీఆర్ఎం నోడల్ అధికారికి అర్జీ అందజేయగా పరిష్కరిస్తామన్నారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని కోరారు. మొత్తం 50 ఫిర్యాదులు రాగా అమరావతిలో భూమి వ్యవహారాలు 38, సామాజిక సంక్షేమం 10, ల్యాండ్‌స్కేప్, ఎన్విరాన్‌మెంట్ 1, కార్యాలయ నిర్వహణ 1 ఉన్నాయి. స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు బి.సాయి శ్రీనివాస నాయక్, జి.రవీందర్, జి. భీమారావు, ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న సీఆర్డీఏ జీఆర్ఎం నోడల్ అధికారి పి జయశ్రీ

రెండు నెలల పెండింగ్ జీతం చెల్లించండి

తుళ్లూరులో సీఐటీయూ ఆధ్వర్యాన ర్యాలీ

తాడికొండ: పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, 36 జీవో ప్రకారం జీతాన్ని రూ.21 వేలకు పెంచాలని, కార్మికుల సంఖ్యను పెంచాలని కోరుతూ తుళ్లూరు సీఆర్డీయే కార్యాలయం ఎదుట రాజధాని ప్రాంత పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేశారు. సీఆర్డీఏ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించారు. ఈ సందర్భంగా సీఐటీయూ గుంటూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ మూడో నెల గడుస్తున్నా ఇప్పటివరకు రాజధాని అమరావతి స్మార్ట్ సిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోతే కార్మికుల కుటుంబాలు ఏ విధంగా జీవనం కొనసాగిస్తాయని ప్రశ్నించారు. అధికారులు ఏజెన్సీపై వంకలు చెబుతూ కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యహించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. రాజధాని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై స్పందించి పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ సుశీల, కుంభ గోపిరాజు, సంఘం నాయకులు ఎల్ సుఖవేణి, వెలగలేటి బుజ్జి, విజయ్ కుమార్, జోజి, అరుణ్ కుమార్, పి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



సీఆర్డీఏ కార్యాలయం ఎదుట బైఠాయించిన పారిశుద్ధ్య కార్మికులు

ముగిసిన అమరావతి-మలేషియా ఇన్వెస్టర్ భేటీ



తాడికొండ: మలేషియాలోని సెలాంగోర్ స్టేట్ సెక్రటేరియట్‌లో గురువారం అమరావతి–మలేషియా ఇన్వెస్టర్ మీటింగ్ విజయవంతంగా జరిగిందని సీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీసీఆర్డీఏ) తరఫున సీఆర్డీఏ కమ్యూనికేషన్స్ విభాగ డిప్యూటీ డైరెక్టర్ మందపాటి సిద్ధార్థ వర్మ నాయకత్వం వహించారు. ఆయనతో పాటు మలేషియా ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్(ఎంవో– ఏసీసీ) తరఫున రవీంద్రన్ వెంకటసామి, సతీష్‌రావు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సిద్ధార్థ వర్మ అమరావతి రాజధాని నగర అభివృద్ధి ప్రాజెక్ట్‌పై సమగ్రమైన ప్రజెంటేషన్ చేసినట్లు వివరించారు. మలేషియా కంపెనీలకు అమరావతిలో లభ్యమయ్యే పెట్టుబడి అవకాశాలను గురించి చర్చించినట్లు తెలిపారు.